సాక్షి
మంచిర్యాల
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



సరిహద్దుల్లో నిఘా
రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సరిహద్దులపై నిఘా ఉంచాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. 8లో▸



గడ్డిక్షేత్రాల పెంపకంపై అవగాహన
అడవిలో వన్యప్రాణులకు సరైన ఆహారం అందించే గడ్డి క్షేత్రాల పెంపకంపై బుధవారం మహారాష్ట్రకు చెందిన గడ్డి క్షేత్రాల నిపుణుడు జీడీ మురత్కర్ అధికారులకు అవగాహన కల్పించారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.6 /25.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం, రుతుపవనాల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

రెడ్‌క్రాస్ వైస్ ప్రెసిడెంట్‌గా అడిషనల్ కలెక్టర్



నియామకపత్రం అందిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్‌గా జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్‌ను ప్రెసిడెంట్, కలెక్టర్ బదావత్ సంతోష్ నామినేట్ చేశారు. ఈమేరకు నియామక ఉత్తర్వులను జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, సబ్ డివిజన్ కన్వీనర్ శరత్ కుమార్ బుధవారం అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ బలోపేతం కోసం, రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేసేందుకు నిర్ణయాలను తీసుకుంటామని తెలిపారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ
మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని తాండూర్, భీమిని కేజీబీవీలలో ఏఎన్‌ఎంలుగా, మంచిర్యాల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా స్థానికతను గుర్తిస్తామని చెప్పారు. ఇంటర్మీడియెట్‌తోపాటు ఏఎన్‌ఎం, ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. వృత్తి విద్య కోర్సులో జీఎన్‌ఎం ట్రైనింగ్, బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. యూఆర్‌ఎస్‌లో నైట్‌వాచ్‌మెన్ కోసం స్థానిక మండలానికి చెందిన వారై ఉండాలన్నారు. ఈనెల 8 నుంచి 13 వరకు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

16న 'మిల్లెట్స్‌-ఏ సూపర్ ఫుడ్ డైట్'పై సెమినార్
మంచిర్యాలఅర్బన్: బెంగళూర్ విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్, టెక్నాలజీ మ్యూజియం(వీఐటీఎం) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈనెల 16న మిల్లెట్స్‌-ఏసూపర్ ఫుడ్ డైట్‌ప్యాడ్ అనే అంశంపై జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సెమినార్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. గరిష్టంగా 6 నిమిషాలు ఇచ్చిన అంశంపై ప్రదర్శన చేయాలని తెలిపారు. తర్వాత న్యాయమూర్తులతో రెండు నిమిషాల ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఉంటుందన్నారు. రాతపరీక్ష అప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు

రామకృష్ణాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు అన్నారు. క్యాతనపల్లి మున్సి పాలిటీ పరిధిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో బుధవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయపూర్ణిమ, మానస, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, చైర్పర్సన్ జంగం కళ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుళ్లకు పదోన్నతి



సీపీతో పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న 29 మందికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లను సీపీ రెమా రాజేశ్వరి అభినందించారు. పదోన్నతితోపాటు బాధ్యత కూడా పెరిగిందని సీపీ తెలిపారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పదోన్నతులతోపాటు అవార్డులు, రివార్డులు అందిస్తున్నట్లు వెల్లడించారు. పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని, అధికారుల మన్ననలు పొందుతూ ఉన్నత పదవులు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ హుల్ హక్, ఏఆర్ ఏసీపీ మల్లికార్జున్, ఆర్ఐలు దామోదర్, విష్ణుప్రసాద్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోషలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

మన మొక్కు బడి



ఇది మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల. మన ఊరు-మన బడి కింద ఎంపిక చేశారు. ప్రహరీ నిర్మాణానికి రూ.79,250, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్ సౌకర్యం కోసం రూ.3,92,123, డ్రింకింగ్ వాటర్ సరఫరాకు 29,272, ఎలక్ట్రిసిటీ కోసం రూ.2,06,389, డైనింగ్ హాల్‌కు రూ.15,16,003, మేజర్ అండ్ మైనర్ రిపేర్లకు రూ.1,12,675 నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో పాఠశాల తరగతి గదుల గోడలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఓవైపు సిమెంట్‌తో దిద్ది మరోవైపు మరిచిపోయారు. డైనింగ్ గ్రిల్స్‌తోపాటు చిన్నచిన్న మరమ్మతులు చేయాల్సి ఉన్నా పూర్తి చేయకపోవటంతో విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు.



పాఠశాలలో అసంపూర్తిగా డైనింగ్‌హాల్ పనులు..

- ఏడాదిన్నరైనా అసంపూర్తిగానే పనులు
- అధికారుల పర్యవేక్షణ లోపం
- నిధులు మంజూరులో జాప్యం
- విద్యార్థులకు తప్పని తిప్పలు

మంచిర్యాలఅర్బన్: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం మన ఊరు-మన బడి పథకం ప్రారంభించింది. సర్కారు పాఠశాలలో చదువుతోన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వసతులను సమకూర్చాలని నిర్ణయించింది. గతేడాది మార్చి 8న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వనపర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పథకాన్ని ప్రారంభించారు. పాఠశాలలను ఆధునీకరించేందుకు మన ఊరు-మన బడి కింద పనులు చేపట్టారు. మంచిర్యాల జిల్లాలో 248 పాఠశాలలను ఈ పథకానికి ఎంపిక చేశారు. 245 బడుల్లో పనులు మొదలయ్యాయి. మూడింటిలో స్థల కొరతతో పనులు ప్రారంభించలేదు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికి రెండు చొప్పున జిల్లాలో 36 పాఠశాలలను ఎంపిక చేశారు. పనులు పూర్తిచేసేందుకు గడువు పెంచినా చిన్నచిన్న మరమ్మతుల పనులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. నెలల తరబడి సాగుతున్న పనులతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

211 పాఠశాలల్లో రూ.30 లక్షలలోపు పనులు..

జిల్లాలో తొలి విడతలో 248 పాఠశాలలు ఎంపిక చేశారు. 211 పాఠశాలల్లో రూ.30 లక్షలలోపు ఉన్న పనులు చేయాల్సి ఉంది. పాఠశాలల్లో నీటి సౌకర్యంతోపాటు టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బందికి సరిపడే ఫర్నిచర్, మరమ్మతులు చేయడం, కిచెన్లు ఏర్పాటు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త గదులు నిర్మించాల్సి ఉంది. పట్టణ ప్రాంతాల్లో పనులు కాస్త ఊపందుకున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో నత్తనడకన సాగుతున్నాయి. నిధుల జాప్యంతో పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడంలేదు.

మందకొడిగా..

ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ప్రకారం పనుల్లో వేగం తగ్గింది. రూ.90.7 కోట్ల నిధులకుగాను రూ.17.81 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఇందులో 69 తరగతి గదుల పనుల్లో 20 మాత్రమే పూర్తయ్యాయి. 245 పాఠశాలల్లో 92 బడుల్లో మాత్రమే తాగునీటి సౌకర్యం కల్పించారు. 156 పాఠశాలల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. డైనింగ్ హాల్ పనులు 60లో 17 పూర్తి చేయగా మిగిలినవి అసంపూర్తిగానే ఉన్నాయి.75 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది. అధికారులు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తే పనులు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

పనుల పూర్తికి చర్యలు..

మన ఊరు-మనబడి కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఇంజినీర్లు, ఎంఈవోలతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలిస్తున్నారు. మెజారిటీ పనులు పూర్తయ్యాయి. మిగిలిన చిన్నచిన్న పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. పనులు పూర్తి చేసిన తర్వాతే నిధులు వస్తున్నాయి.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ఎంఎల్‌ఎస్ పాయింట్ తనిఖీ

- రికార్డులు పరిశీలించిన కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, రాష్ట్ర టాస్క్ ఫోర్స్ అధికారులు నస్పూర్ పట్టణం తీగల్ పహాడ్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను బుధవారం తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న రికార్డులు, బియ్యం స్టాక్, నాణ్యత, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో గోదాంలోని రోజువారీగా రికార్డులు సక్రమంగా లేనట్లు గుర్తించారు. రికార్డులు అప్‌డేట్ చేశాక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట రాష్ట్ర సివిల్ సప్లయ్ జీఎం(ఫైనాన్స్) భాస్కర్, టాస్క్ ఫోర్స్ అధికారులు, జిల్లా ఇన్‌చార్జి డీఎం గోపాల్, డీటీ రజిత తదితరులు ఉన్నారు. తీగల్‌పహాడ్ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు రెగ్యులర్ ఉద్యోగి లేక అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి నుంచి సకాలంలో రేషన్ షాపులకు బియ్యం రవాణా చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ తనిఖీలు చేయడం గమనార్హం. అనంతరం ఆసిఫాబాద్ జిల్లాలో తనిఖీలు జరిపారు.

మంచిర్యాల అభివృద్ధి కనిపించడం లేదా?

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: తాను ఎమ్మెల్యేగా మంచిర్యాల నియోజకవర్గాన్ని పూర్తిస్థాయి అభివృద్ధి చేశానని, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా ఆరేళ్ల పదవిలో కొనసాగిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం మాట్లాడారు. ప్రజలను మోసం చేసి సంపాదించిన డబ్బులతో చీరలు పంపిణీ చేస్తున్నారని, భూకబ్జాలు చేయడం, బ్యాంకులకు రుణాలు ఎగవేయడం ప్రేమ్‌సాగర్‌రావు నైజం అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసిన చంద్రశేఖర్ నుంచి రూ.4 కోట్లు, ఇతర అభ్యర్థులకు చెందిన డబ్బులు దాదాపుగా రూ.6 కోట్ల వరకు వసూలు చేసి ఆ డబ్బులతో ఆయన తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్నాడని వివరించారు. 2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యేగా తాను ఉన్న సమయంలోనే కాసిపేట మండలంలో 14 వాటర్ ప్రాజెక్టులను కట్టించానని, దేవాపూర్ సిమెంట్ కంపెనీ కోసం భూమి కోల్పోయిన 20 మందికి ఉద్యోగాలను ఇప్పించిన ఘనత తనదేనని వివరించారు. మంచిర్యాలకు మెడికల్ కాలేజీ తెప్పించానని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో 380 పడకల ఆసుపత్రి నిర్మాణం ఏడాదిన్నరలోగా పూర్తి చేస్తామన్నారు. అనంతరం ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కూడా వినియోగించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి అవగాహన లేకుండా ఐబీలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను కూల్చివేసి, అక్కడే మాతాశిశు ఆరోగ్య కేంద్రం కడతానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. హిందూ స్మశాన వాటిక గోదావరి నది ఒడ్డునే ఉంటుందని, కానీ అక్కడ వద్దని మాజీ ఎమ్మెల్సీ అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తనపై ఆరోపణలు చేస్తూ పార్టీని వీడిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మూడోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యేగా మరోసారి తాను గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, నస్పూర్ చైర్మన్ ప్రభాకర్, డీసీసీబీ చైర్మన్ తిప్పని లింగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులు త్వరగా పరిశీలించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశం మందిరంలో అన్ని మండలాల ఈఆర్‌పీలు, బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఈనెల 19 వరకు పూర్తిస్థాయి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఓటరు నమోదు పై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, డీఆర్డీవో శేషాద్రి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభ్యాసకులు ఆర్థిక పురోగతి సాధించాలి...



అభ్యాసకులతో కలెక్టర్ బదావత్ సంతోష్

వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ సఖీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు అందించిన కుట్టుశిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న మెలకువలను అభ్యాసకులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 37 మందికి సర్టిఫికెట్లు అందించారు. 37 అక్షర వలంటీర్లతో 185 మంది నిరాక్ష్యరాస్యులను అక్ష్యరాస్యులుగా మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్పీ పోకల వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్, సఖీ అధ్యక్షుడు బండ శాంభరి, ఇన్‌స్పెక్టర్ జ్యోతి, వలంటీర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల కార్యవర్గం
మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ భవన్‌లో బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్‌యాదవ్, సెంట్రల్ ఫోరం మెంబర్ శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, రామ్మోహన్‌రావు కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా మంచిర్యాల మున్సిపల్ ఆర్‌వో కె.శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నస్పూర్ ఆర్‌వో కె.సతీశ్, వైస్ ప్రసిడెంట్‌గా బెల్లంపల్లి ఆర్‌వో ఆర్.భుజంగరావు, మంచిర్యాల హెల్త్ అసిస్టెంట్ సునీల్‌రాథోడ్, మందమర్రి సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, మంచిర్యాల సీనియర్ అసిస్టెంట్ బి.శ్రావిష, కార్యదర్శిగా క్యాతన్‌పల్లి ఆర్‌వో పి.కృష్ణ ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా లక్సెట్టిపేట్ జూనియర్ అసిస్టెంట్ ఎం.రాజశేఖర్, మంచిర్యాల ఆర్ఐ మజార్, క్యాతన్‌పల్లి జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్, కోశాధికారిగా చెన్నూరు జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, ఈసీ మెంబర్లుగా శివరామ కృష్ణ, ఎం.అంజయ్య, ఎండీ.నవీద్, జె.రాజ్‌కుమార్, గద్దం శంకర్, ఐ.రాజ్‌కుమార్, ఎండీ.అజీమ్, ఈ.వసంత్, ఎం.సత్యనారాయణను నియమించారు.

మస్టర్ ఒకరిది... డ్యూటీలో మరొకరు!

- మందమర్రి ఏరియా కేకే-5 గనిలో ఘటన
- ఆలస్యంగా విషయం వెలుగులోకి..



మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా అధికారుల పర్యవేక్షణ లోపంతో.. కార్మికుడి స్థానంలో మరొకరు విధులు నిర్వహించడం చర్చనీయాంశమైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయం సంస్థ వ్యాప్తంగా సంచలనమైంది. సమాచారం అందుకున్న అధికారులు గని అధికారికి చార్జి మెమో జారీ చేసినట్లు తెలిసింది. ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏరియాలోని కేకే-5 గనిలో టెక్నికల్ ఉద్యోగి విధి నిర్వహణకు 15 రోజుల క్రితం గనిపైకి వచ్చి మస్టర్ పడ్డాడు. ఆరోజు ఆదివారం కావడంతో సహోద్యోగులు దావత్ ఏర్పాటు చేశారు. ఈమేరకు విధులకు వచ్చిన కార్మికుడికి కూడా సమాచారం అందించారు. దీంతో సదరు కార్మికుడు విధులకు డుమ్మా కొట్టలేక ఆ గనిలోనే విధులు నిర్వహించే మరో టెక్నికల్ ఉద్యోగిని పిలిపించి అతడితో డ్యూటీ చేయించాడు. ఈ విషయం ఇటీవల బయటకు వచ్చింది. విధులు నిర్వహించిన ఉద్యోగికి గని అధికారి నోటీస్ జారీ చేసినట్లు సమాచారం. సింగరేణి చరిత్రలో మస్టర్ ఒకరు పడి విధులు మరొకరు చేయడం ఇంత వరకు ఎరిగి ఉండమని, విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా ఉండేదని అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు.

బడుగులపై పిడుగులు!



కౌటాల మండలం ముత్తంపేట గ్రామ సమీపంలో పిడుగుపాటుతో మృతి చెందిన రైతులు(ఫైల్)

- ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత
- ప్రకృతి వైపరీత్యాలతో కుటుంబాలు ఆగం
- పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం
- ఉమ్మడి జిల్లాలోని బాధిత కుటుంబాల్లో తీరని విషాదం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాయకష్టం చేసుకుంటూ జీవనం సాగించే బడుగుల జీవితాలను పిడుగులు ఆగం చేస్తున్నాయి. ఏటా వానాకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పిడుగులు ప్రభావంతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 8 మంది పిడుగుపాటుకు బలయ్యారు. మేకలు, గొర్రెలు, పశువులు మృత్యువాతపడి ఆస్తి నష్టం జరిగింది. పిడుగులకు ఎక్కువగా రైతులు, కూలీలు, పశువులు, మేకల, గొర్రెల కాపర్లు బలవుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏ ప్రాంతంలో పిడుగు పడబోతోందో హెచ్చరించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చినా పిడుగుపాటు మరణాలు కొనసాగుతుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో అడవులు, నీటి ప్రవాహాలు, ఎత్తయిన కొండలు ఎక్కువగా ఉండ డం, పశువుల కాపర్లు, మత్స్యకారులు, రైతులు, కూలీలు వర్షంలోనే పనులు చేస్తుండడంతో ప్రమాద బారిన పడుతున్నారు.

పరిహారం అందడం లేదు

ప్రకృతి వైపరీత్యాలకు పరిహారం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.6 లక్షలు ఇస్తున్నాయి. అయితే ఈ పరిహారం పొందేందుకు తహసీల్దార్, ఎస్సై, వైద్యాధికారితో కూడిన కమిటీ పిడుగుపాటుతో చనిపోయినట్లు నిర్ధారణ చేయాలి. ఆ తర్వాత బాధిత కుటుంబాలకు రెవెన్యూశాఖ నుంచి పరిహారం అందుతుంది. అయితే రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో బాధిత కుటుంబాలకు ఈ పరిహారం అందడం లేదు. మంచిర్యాల జిల్లాలో 2020 నుంచి 2021 మధ్య ఐదుగురికి రూ.6 లక్షల చొప్పున మంజూరైనా నిధులేమితో బాధిత కుటుంబాలకు అందని పరిస్థితి. ఇక కొన్నిసార్లు పిడుగుపాటుతో మరణించినప్పటికీ అధికారుల లెక్కల్లోకి రాక, బాధితులు పరిహారానికి దూరమవుతున్నారు.

అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

పిడుగుపాటుపై నేటికీ గ్రామీణుల్లో అవగాహన లేమితో మరణాలు జరుగుతున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నప్పుడు చెట్లు, నీటి ప్రవాహాలు, కొండలు, విద్యుత్ సరఫరా స్తంభాలు, ఎత్తయిన తాటి చెట్లకు దూరంగా ఉండాలి. ఒకే చోట ఎక్కువ మంది గుమిగూడడం, పశువులు, జీవాల గుంపుగా ఉండొద్దు. ఉరుములు, మెరుపులు వస్తే, ఇంటికి వెళ్లడం లేదా సమీపంలోనే ఉన్న రక్షిత ప్రాంతానికి తరలాలి. బీపీ, గుండె జబ్బులు, ఫిట్స్ వచ్చే వాళ్లు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు బయట ఉండొద్దు. పిడుగు పడే సమయంలో అరచేతులతో చెవులు మూసుకోవాలి. నేలపై మోకాళ్ల మీద కూర్చొని తలకిందకు వంచాలి. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, బైక్‌లకు దూరంగా ఉండాలి. ఉరుములు, మెరుపుల సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడొద్దు. గ్రామాల్లో పిడుగులపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి..



ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నవేగాంకు చెందిన బోయిని మల్లేశ్(35) ఈఏడాది జూలై 4న మేకలు మేపుతుండగా పిడుగుపాటుకు గురై ప్రాణాలు వదిలాడు. తనకున్న పది గొర్రెల ఆధారంగానే భార్య సునీత, ముగ్గురు పిల్లల జీవనం సాగేది. ఇంటి పెద్దదిక్కు అకాల మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. కుటుంబ బాధ్యత మల్లేశ్ తండ్రి సాంబయ్యపై పడింది. సర్కారు నుంచి పైసా పరిహారం అందలేదు.

- 2021, జూలైలో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలానికి చెందిన దోత్రే శోభ చేనులో పిడుగుపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తండ్రి గతంలోనే అనారోగ్యంతో చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు దేవిక, డేవిడ్.. అమ్మానాన్నలకు శాశ్వతంగా దూరమయ్యారు. ప్రస్తుతం వారి చిన్నమ్మ వద్ద ఉండి చదువుకుంటున్నారు. సర్కారు నుంచి వీరికి ఎటువంటి పరిహారం అందలేదు.

జిల్లాల వారీగా పిడుగుపాటు మరణాలు (గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌వరకు)

ఆదిలాబాద్	01
ఆసిఫాబాద్	04
మంచిర్యాల	02
నిర్మల్	01
మొత్తం	08

లైటెనింగ్ కండెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి



పిడుగు ముప్పు తప్పించుకునేలా ఎత్తయిన భవనాలు, ఇళ్లపై లైటెనింగ్ కండెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇది పిడుగును ఆకర్షించడంతో ముప్పు తప్పించుకోవచ్చు. లైటెనింగ్ కండెక్టర్‌ను కాపర్‌తో తయారు చేసిన త్రిశూలాన్ని ఎత్తయిన కట్టడాల మీద ఏర్పాటు చేస్తారు. ఈ కాపర్ వైర్‌ను భూమికి కలుపుతారు. హై ఓల్టేజ్ ప్రవాహం భూమిలోకి వెళ్లి పోతుంది.

– ఎం.కిశోర్‌కుమార్, భౌతికశాస్త్రం, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

వానాకాలం ప్రారంభం నుంచే మరణాలు..

- గత ఏప్రిల్‌లో అకాల వర్షం పడి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురాలో మేకల కాపరి మోహన్ (21), మే నెలలో ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన మధూకర్(21) పిడుగులు పడి చనిపోయారు.
- గత జూన్ 11న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూరుకు చెందిన కడ్తల గురువయ్య(73) ఊళ్లో పోచమ్మ గుడికి వెళ్లి వస్తుండగా పిడుగు పడి చనిపోయాడు.
- బెజ్జూర్ మండలం పోతేపెల్లికి చెందిన తొడసం పోసక్క(20) ఈనెల 2న పిడుగుపాటుకు బలైంది. పోసక్క మంచిర్యాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. ఇటీవల రాఖీ పండుగకు ఇంటికి వచ్చింది. స్నేహితురాలైన భూదక్కతో కలిసి చేనులోకి మిరపనారు వేయడానికి వెళ్లింది. సా యంత్రం పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న భూదక్కకు తీవ్ర గాయాలయ్యాయి.
- భీమారం మండల కేంద్రంలోని తెనుగువాడకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బండారి లింగయ్య(68) ఈనెల 2న పిడుగుపాటుతో మృతి చెందాడు. బ్యాంక్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతి చెందాడు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో బుధవారం చెన్నూర్ మండలంలోని లంబడిపల్లి, కోటపల్లి మండలంలోని ఆలుగాం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. ఈ దాడుల్లో 27 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ఆరెపల్లిలో కూలిన ఇంటిగోడ

భీమారం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆరెపల్లిలో దుర్గం వెంకటయ్యకు చెందిన ఇంటిగోడ మంగళవారం రాత్రి కూలింది. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా గోడ పడిపోవడంతో అంతా బయటకు వచ్చినట్లు బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

దహెగాం: మండలంలోని గిరవెల్లిలో బుధవారం ఉనుక లారీ ఢీకొట్టిన ఘటనలో విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. డ్రైవర్ అజాగ్రత్తగా లారీ నడపడంతోనే సంఘటన చోటు చేసుకుందని గ్రామస్తులు పేర్కొన్నారు. మరో స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పిడుగుపాటుకు పది గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట అటవీప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపడి పది గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఈర్ల మల్లయ్య తన గొర్రెల మందను గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో మేపుతుండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పిడుగుపడడంతో పది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

వృద్ధుడి ఆత్మహత్య



నర్సయ్య మృతదేహం..

దండేపల్లి(మంచిర్యాల): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన ముత్తినేని నర్సయ్య(65)కు భార్య, పిల్లలు ఎవరు లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. కొద్దిరోజులుగా మానసిక స్థితి బాగోలేదు. బుధవారం పురుగుల మందు తాగాడు. విషయాన్ని తన బంధువైన సునీల్‌కు చెప్పడంతో లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సునీల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సరిహద్దుల్లో నిఘా

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, పక్కన డీఎస్పీలు

ఉట్నూర్‌రూరల్: రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కె. సురేశ్ కుమార్, నిర్మల్ అదనపు ఎస్పీ వీరయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాతో సరిహద్దు కలిగిన పోలీస్‌స్టేషన్ అధికారులు రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాకు అక్రమ మార్గాల్లో అనుమతి లేని వాటిని అరికట్టే విషయంలో అంతర జిల్లా, రాష్ట్ర చెక్ పోస్టులు ఉపయోగపడతాయని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతరం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని మారుమూల గ్రామాలను నిరంతరం అధికారులు సందర్శిస్తూ మావోయిస్టుల ప్రాబల్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, ఆదిలాబాద్ డీఎస్పీ వి.ఉమేందర్, ఆదిలాబాద్ డీసీఆర్బీ అండ్ ఎలక్షన్ సెల్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్, నిర్మల్ డీఎస్పీ ఏ.గంగారెడ్డి, ఆసిఫాబాద్ డీఎస్పీ కే.శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ ఏ.కరుణాకర్, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సరిహద్దు కలిగిన సర్కిల్ ఎస్సైలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. రెబ్బెన మండలకేంద్రంలోని సీఐ కార్యాలయంలో బుధవారం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్ ఆధ్వర్యంలో జిల్లాల సరిహద్దు ప్రాంతాల పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. రెబ్బెన, తిర్యాణి, దహెగాం పోలీస్ స్టేషన్‌కు సరిహద్దులుగా ఉన్న బెల్లంపల్లి సబ్ డివిజన్‌లోని తాండూర్, మాదారం, భీమిని, కన్నెపల్లి, దేవాపూర్ అధికారులతో ఎన్నికల దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా, మద్యం, నగదు సరఫరా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని నిర్ణయించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించారు. సమావేశంలో రెబ్బెన సీఐ అల్లం నరేందర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, తాండూర్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు రమేశ్, సనత్‌రెడ్డి, రాజశేఖర్, ఆంజనేయులు, నరేశ్, మహేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతుల సేవలో తరించిన రాజేశ్వర్ నాయక్



రాజేశ్వర్ నాయక్‌ను సన్మానిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేశ్వర్‌నాయక్ రైతుల సేవలో తరించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తున్న రాజేశ్వర్‌నాయక్‌కు బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ల పాటు రాజేశ్వర్ నాయక్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో వ్యవసాయం కొత్త పుంతలు తొక్కించడంలో కేవీకే నిర్వహించిన పాత్ర మరువలేనిదన్నారు. రాజేశ్వర్ నాయక్ మాట్లాడుతూ తనకు ఇంతకాలం సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన , జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, జిల్లా పరిశ్రమల అభివృద్ధి అధికారి సాయినాథ్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్‌కుమార్, బెల్లంపల్లి, భీమిని, మంచిర్యాల ఏడీఏలు సురేఖ, ఇంతియాజ్ అహ్మద్, అనిత, ఏఓలు రజిత, వందన, కిరణ్మయి, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, స్రవంతి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ సంక్షేమ నిధి' సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందిస్తున్న సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉపాధ్యాయులు 'కుటుంబ సంక్షేమ నిధి'ని సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. అకస్మాత్తుగా మృతిచెందిన ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకోవడానికి టీఎస్ యూటీఎఫ్ ప్రారంభించిన సంక్షేమ నిధి ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆగస్టు 28న అనారోగ్యంతో మృతి చెందిన లక్సెట్టిపేట మండల ఉపాధ్యాయుడు శనిగారపు రమేశ్ సంస్మరణ సభ బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లిలో నిర్వహించారు. మృతుని కుమార్తె శ్రీజకు సంక్షేమ నిధి నుంచి రూ.6 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంక్షేమ నిధి చైర్మన్ చావ రవి, జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజవేణు, సంక్షేమ నిధి రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గడ్డిక్షేత్రాల పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మురత్కర్

జన్నారం: అడవిలో వన్యప్రాణులకు సరైన ఆహారం అందించే గడ్డి క్షేత్రాల పెంపకంపై బుధవారం మహారాష్ట్రకు చెందిన గడ్డి క్షేత్రాల నిపుణుడు జీడి మురత్కర్ అధికారులకు అవగాహన కల్పించారు. కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలోని టీడీసీలో నిర్వహించిన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి అటవీ సర్కిళ్ల నుంచి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులు, పర్యావరణ పరిస్థితులు బాగున్న చోటే వన్యప్రాణులు నివాసం ఉంటాయన్నారు. వన్యప్రాణులు అధికంగా ఉన్న చోట పులి ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందన్నారు. అనంతరం జన్నారం అటవీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పెంచుతున్న గడ్డి క్షేత్రాలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్, ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్ ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎఫ్‌డీవో శివ్‌ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవో మాధవరావు, వివిధ సర్కిళ్లకు చెందిన 34 మంది ఎఫ్‌డీవోలు, 79 మంది ఎఫ్ఎస్‌వోలు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

కూతురి బారసాల వేడుకల్లో తండ్రిని కాటేసిన కరెంటు



టేకం మారు మృతదేహం

కాసిపేట(బెల్లంపల్లి): ఎనిమిది రోజుల క్రితం ఆ ఇంట్లో ఆడపిల్ల పుట్టింది. శ్రావణ శుక్రవారం మహాలక్ష్మి వచ్చిందని అందరూ సంబురపడ్డారు. కూతురు రాకతో తమ రాత మారుతుందని భావించారు. కానీ బారసాల వేడుకల్లో మృత్యువు కరెంటు రూపంలో తండ్రిని కాటేసింది. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని కొలాంగూడలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట మండలం వెంకటాపూర్, కొలాంగూడకు చెందిన టేకం మారు (22)కు ఏడాది క్రితం వివాహమైంది. ఆగస్టు 29న కూతురు జన్మించింది. మంగళవారం ఇంటి వద్ద పేరు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. వేడుక అనంతరం బంధువులకు భోజనాలు ఏర్పాటు చేశారు. రాత్రి 9.30 గంటల సమయంలో కూర వడ్డించడానికి ఇంట్లో వంటపాత్రలు తీస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన అతని తండ్రి టేకం గంగు మెయిన్ ఆఫ్ చేసినా అప్పటికే అప్పటికే మృతి చెందాడు. సీలింగ్ ఫ్యాన్‌కు ఉన్న విద్యుత్ తీగ రేకుల షెడ్ ఇనుప పట్టీకి తాకడంతో విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గనులను సందర్శించిన అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 ఇంక్లయిన్ గనిని బుధవారం డీఎంఎస్(డైరెక్టర్ ఆఫ్ మైన్స్) సేఫ్టీ మెకానికల్ ఆర్ముగం తనిఖీ చేశారు. అధికారులు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు డీఎంఎస్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏజీ ఎం ఈఅండ్ఎం నాగరాజు, ఏజెంట్ రామదాసు, డీజీఎం సేఫ్టీ రామనందం, రూఫ్ ఇంజినీర్ శ్రీరాంప్రసాద్, గని మేనేజర్ గొడిసెల లక్ష్మీనారాయణ, పిట్ ఇంజినీర్ రఘు, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నస్పూర్: మైనింగ్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా బుధవారం డీడీఎంఎస్ అధికారులు ఆర్కే 6 గనిని తనిఖీ చేశారు. మైనింగ్, సర్వే విభాగానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్(మైనింగ్) కే.ప్రేంకుమార్, ఏజెంట్ ఏవీరెడ్డి, అధికారులు తిరుపతి, కాదాసి శ్రీనివాస్, వీరన్న, కొమురయ్య, శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

జన్నారం: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన గొర్రెకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ, సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరు తగిలి లింగయ్యపల్లికి చెందిన సల్ల మహేష్ గొర్రె మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి మహేష్ ఆధ్వర్యంలో రాస్తారోకోకు దిగారు. విషయం తెలుసుకున్న సబ్ ఇంజనీర్ అజయ్ పరిహారం అందేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి సాధించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తిలో ఎలాంటి విగాతం కలుగకుండా లక్ష్యాలను సాధించాలని డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్), (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. డైరెక్టర్లు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఇందారం, శ్రీరాంపూర్ ఉపరితల గనుల్లో ఓబీ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని, ఓబీ ఎంత ఎక్కువగా తీస్తే అంత ఎక్కువ బొగ్గు ఉత్పతి చేయడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఇందారం ఓసీపీ పీఓ ఎం. శ్రీనివాస్, అధికారులు చిరంజీవులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్‌బజార్లను మూసివేయడం లేదు'



సరుకులను పరిశీలిస్తున్న ఎండీ

రామకృష్ణాపూర్: సింగరేణి సూపర్ బజార్లను మూసివేయడంలేదని ఎండీ సామ్యేల్ సుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం రామకృష్ణాపూర్ సూపర్ బజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న సూపర్‌బజార్లలో సరుకుల నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని రకాల నిత్యావసర సరుకులు కార్మిక కుటుంబాలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. నష్టాల్లో ఉన్న వాటిని కూడా లాభాల్లోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ సుదర్శన్, డివిజనల్ మేనేజర్లు ప్రకాష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

మంచిర్యాలక్రైం: పాతమంచిర్యాలలోని సాయిబాబా ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆలయ అర్చకుడు ధీరజ్ ఉపాధ్యాయ గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం చూడగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. హుండీ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హుండీలో ఉన్న రూ.46వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు పగులగొట్టి హార్డ్‌డిస్కులు సైతం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న రష్మీఠాగూర్



పూజలు చేస్తున్న రష్మీఠాగూర్

భైంసా: మాజీ మిస్ ఇండియా, తెలంగాణ ఐటీ హబ్ బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాగూర్ బుధవారం కుటుంబసమేతంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేసి, అమ్మవారి శేషవస్త్రంతో ఆశీర్వచనాలు అందజేశారు.

'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలి

నస్పూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి, కార్మికశాఖ అధికారులు తరుచూ సమావేశాలు ఏర్పాటు చేస్తూ, సమయం వృథా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 11న కార్మిక ఉపశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసినట్లు, తమకు లేఖ అందిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక కారణం చెప్పి ఎన్నికలు వాయిదా వేస్తూ వస్తుందని ఇప్పటికైనా ఎన్నికలు వెంటనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేసింగ్ బైక్‌లు సీజ్

మంచిర్యాలక్రైం: పట్టణంలోని కాలేజీరోడ్‌లో స్పోర్ట్స్ బైక్స్‌తో స్టంట్లు వేస్తూ విన్యాసాలకు పాల్పడుతున్న నాలుగు వాహనాలను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ శబ్దాలతో రహదారి వెంట వెళ్లే వారికి దడ పుట్టిస్తున్నారని స్థానికుల ఫిర్యాదుతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

వ్యక్తి అదృశ్యం

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్‌కు చెందిన రేకలగణేశ్ (33) అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఈనెల 1న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన గణేశ్ ఇంటికి రాకపోవడంతో అతని భార్య సంధ్య బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

జిల్లాలో 20.9 మిల్లీ మీటర్ల వర్షం

మంచిర్యాలఅగ్రికల్చర్/చెన్నూర్: జిల్లాలో మంగళవారం నుంచి బుధవారం వరకు 20.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దండేపల్లిలో 48.6 మిల్లీ మీటర్లు, తాండూర్‌లో 43.1, లక్సెట్టిపేటలో 28.4, కాసిపేటలో 25.6, కోటపల్లిలో 26.5, చెన్నూర్‌లో 26.3, వేమనపల్లిలో 22.7, మంచిర్యాలలో 21.9, జన్నారంలో 15.2, జైపూర్‌లో 16.4, నస్పూర్‌లో 15, భీమారంలో 15.3, మందమర్రిలో 17.7, బెల్లంపల్లిలో 17.7, భీమినిలో 11.7, హాజీపూర్‌లో 14.7, కన్నెపెల్లిలో 5.6, నెన్నెలలో 3.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 835.1 మి.మీ కాగా, 950 మి.మీ వర్షం కురిసింది. 5 శాతం అధికంగా నమోదైంది. భీమిని, కన్నెపెల్లి మండలాల్లో 20 నుంచి 28 శాతం లోటు నెలకొంది. నాలుగు రోజులుగా వర్షాలు తెరిపివ్వకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు.

తునికాకు బోనస్ చెల్లించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న తునికాకు కూలీలు

వేమనపల్లి: తునికాకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కేతన్‌పల్లి, కల్మలపేటకు చెందిన కూలీలు నీల్వాయి అటవీ రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా బోనస్ రావడంలేదన్నారు. కాగా కూలీలు ధర్నాకు వస్తున్న విషయం తెలుసుకున్న సిబ్బంది కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. సుమారు మూడున్నర గంటలపాటు ధర్నా నిర్వహించినా సిబ్బంది ఎవరూ అక్కడికి రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో బోనస్ డబ్బులు ఇప్పించాలని, లేనిపక్షంలో కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేపడుతామని హెచ్చరించారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి



దర్శించుకుంటున్న తహసీల్దార్ రమేశ్

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న స్వామి ఆలయంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం సందర్భంగా పరిసర ప్రాంతాల భక్తులు గుట్టపై దొణలో స్వయంభుగా వెలిసిన గట్టు మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. తహసీల్దార్ రమేశ్,ఆర్ఐ కమల స్వామివారిని దర్శించుకున్నారు.

పులిదాడిలో లేగదూడ మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని సిద్దేశ్వర గుట్ట అటవీప్రాంతంలో బుధవారం మేతకు వెళ్లిన పశువుల మందపై పెద్దపులి దాడి చేయడంతో సులుగుపల్లి గ్రామానికి చెందిన దుర్గం గంగరామ్ లేగ దూడ మృతి చెందింది. బాధిత రైతుకు అటవీశాఖ నుంచి నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎఫ్‌బీవోలు దినేష్, మహేష్ తెలిపారు. అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం ఉన్నందువల్ల పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి 'గాదె' దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాస్

దండేపల్లి(మంచిర్యాల): మంచిర్యాల నియోజక వర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగేందుకు దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు గాదె శ్రీనివాస్ దరఖాస్తు చేసుకున్నాడు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేసినట్లు 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తాను చేసిన కార్యక్రమాలతో పాటు, పార్టీలో చేపట్టిన పదవులు, తన వ్యక్తిగత వివరాలను దరఖాస్తులో పేర్కొన్నట్లు తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ పార్టీ టికెట్ బీసీ అభ్యర్థిగా తన దరఖాస్తును పరిశీలించాలని పార్టీ ముఖ్య నాయకులను కోరినట్లు చెప్పారు.